సాక్షి
వైఎస్సార్ జిల్లా
శుక్రవారం । 9 । జూన్ । 2023



లంకమలలో పెరుగుతున్న చిరుతలు
లంకమల్లేశ్వర అభయారణ్యంలో చిరుతపులులు ఏటికేడాది పెరుగుతున్నాయి. - 8లో



ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి
ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, వైద్యపరీక్షలు నిర్వహించరాదని వైద్యాధికారులు పేర్కొన్నారు. - 8లో



ఆత్మహత్యకు యత్నం.. కాపాడిన పోలీసులు
భార్యతో గొడవపడి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని పోలీసులు కాపాడిన సంఘటన కలసపాడు మండలంలో జరిగింది. - 8లో

న్యూస్‌రీల్

కన్సల్టెంట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప సెవెన్‌రోడ్స్: కాంట్రాక్టు పద్ధతిలో కన్సల్టెంట్లుగా పనిచేసేందుకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ జిల్లాలో ప్రజల జీవనోపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు హెచ్‌టీటీపీఎస్://కేఏడీఏపీఏ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

12న పెన్షన్ అదాలత్

కడప కల్చరల్: ఈపీఎఫ్ పెన్షనర్లు, సభ్యులకు పీఎఫ్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు తమ ఫిర్యాదులను సులభంగా పరిష్కరించుకునేందుకు ఈనెల 12వ తేదీన అవకాశాన్ని కల్పిస్తున్నామని అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్, పెన్షన్ విభాగం రీజినల్ ఆఫీసర్ వి.ప్రేమలత ఒక ప్రకటనలో తెలిపారు. 2023కు సంబంధించి ఈనెల 12న ఉదయం 11 గంటలకు వెబెక్స్ వేదికగా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పెన్షనర్లు, భవిష్యత్తులో పెన్షన్ తీసుకోనున్న వారు తమ ఫిర్యాదులను ఈ వేదికపై నిర్వహించనున్న పెన్షన్ అదాలత్‌కు హాజరై పరిష్కరించుకోవచ్చన్నారు.

12వ తేదీలోపు ధ్రువపత్రాలతో ప్రవేశం పొందాలి

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ఎంపికైన వారు ఈనెల 12వ తేదీలోపు సంబంధిత ధ్రువపత్రాలతో ప్రవేశం పొందాలని గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్, కన్వీనర్ అబ్దుల్ రసూల్ తెలిపారు. గత నెల 20వ తేదీ నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను ఈనెల 8వ తేదీన విడుదల చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఎస్ఎంఎస్ ద్వారా 9వ తేదీ సమాచారం పంపిస్తామన్నారు. విద్యార్థులు తమ ఫలితాలు తెలుసుకునేందుకు https://arps.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. వివరాలకు 9059500173 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జిల్లా అగ్నిమాపక అధికారిగా ధర్మారావు బాధ్యతల స్వీకరణ



కడప అర్బన్: జిల్లా అగ్నిమాపక అధికారిగా ధర్మారావు గురువారం కడపలోని కలెక్టరేట్ ఆవరణంలోని జిల్లా అగ్నిమాపకశాఖాధికారి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన 1993లో స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌గా విధుల్లో చేరారు. 2017లో జిల్లా అగ్నిమాపక అధికారిగా పదోన్నతి పొందారు. సత్తెనపల్లిలోని అగ్నిమాపక శిక్షణా కళాశాలలో శిక్షణా అధికారిగా పనిచేస్తూ ఉండగా వైఎస్ఆర్ జిల్లా అగ్నిమాపక అధికారిగా బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఆయన విలేకరులతో మాట్లాడారు. సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు.

బౌద్ధ పర్యాటక కేంద్రం లీజుకు టెండర్లు

రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా నందలూరు మండలం అడపూరు గ్రామంలో ఉన్న బౌద్ధ స్థూపాల వద్ద నిర్మించిన పర్యాటక బుద్ధుని కేంద్రాన్ని 10 సంవత్సరాలు లీజుకు ఇచ్చేందుకు వేలం పాట నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేలం పాట ఈనెల 13వ తేదీ మంగళవారం రాయచోటిలోని జిల్లా పర్యాటక శాఖ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు రూ.2 వేలు ధరావత్తు సొమ్మును చెల్లించి పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాల కోసం 6309942032కు ఫోన్ ద్వారా కానీ లేదా నేరుగా పర్యాటక కార్యాలయం వద్దకు వచ్చి సంప్రదించాలని సూచించారు.

జిల్లాకు 10,500 హెక్టార్లకు సూక్ష్మసేద్య లక్ష్యం




మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి

కడప అగ్రికల్చర్: జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 10,500 హెక్టార్లకు సూక్ష్మసేద్యాన్ని లక్ష్యంగా నిర్దేశించామని ఎంపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప కలెక్టరేట్ ఆవరణంలోని ఏపీ సూక్ష్మనీటి సాగు పథకం కార్యాలయంలో సిబ్బంది, జిల్లా కంపెనీ ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 8000 హెక్టార్ల లక్ష్యంగా నిర్దేశించగా 9982 హెక్టార్ల లక్ష్యాన్ని పూర్తి చేశామన్నారు. ఇందులో ఇప్పటి వరకు 9085 హెక్టార్లకు బిందు, తుంపర సేద్య పరికరాలను రైతులకు అందించామన్నారు. మిగిలిన వారికి త్వరలో అందజేస్తామన్నారు. ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మిషన్ రాయలసీమ.. అంతా కపట ప్రేమ

- నాడు ఎన్టీఆర్‌ను అలా.. నేడు రాయలసీమను ఇలా..!
- నారా లోకేష్ మిషన్ రాయలసీమ డిక్లరేషన్‌పై మండిపడుతున్న మేధావులు
- అధికారంలో ఉన్నన్నాళ్లు గండికోట ప్రాజెక్టు అప్రాధాన్య జాబితాలోనే
- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను విస్తరించిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి
- టీడీపీ నేత దేవినేని ఉమా ద్వారా అనేక అడ్డంకులు సృష్టించిన చంద్రబాబు





సాక్షి ప్రతినిధి, కడప: వినేవారు లోకువైతే చెప్పేవాడు చంద్రబాబు అన్నది విశ్లేషకుల నానుడి. ఇప్పుడు సరిగ్గా ఇదే రీతిలో వ్యవహరిస్తున్నారు చంద్రబాబు తనయుడు నారా లోకేష్. నాడు ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి పదవి నుంచి దించేసి మానసిక క్షోభకు గురిచేసి, ఆయన మరణానికి దారితీసిన పరిస్థితుల్ని చంద్రబాబు అండ్ కో సృష్టించారు. ఇటీవల ఎన్టీఆర్ శత జయంతి వేడుకల పేరుతో ఆయా నేతలే హంగామా చేశారు. అప్పటి ఉదంతాన్ని 'మిషన్ రాయలసీమ' గుర్తు చేస్తోంది. యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్న నారా లోకేశ్ కడపలో ప్రకటించిన 'మిషన్ రాయలసీమ' డిక్లరేషన్‌పై నాడు ఎన్టీఆర్ పట్ల అలా... నేడు రాయలసీమ విషయంలో ఇలా... నక్క వినయం ప్రదర్శిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

విభజన ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నన్నాళ్లు రాయలసీమను టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అదేమంటే రాయలసీమలో తమకు ఓట్లు, సీట్లు ఇవ్వరని, అందుకే అభివృద్ధి చేయలేదని నిర్లజ్జగా ప్రకటించారు. గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో సీఎం హోదాలో చంద్రబాబు నాయుడు పాణ్యంలో బహిరంగంగా ఆ విషయాన్ని వెల్లడించారు. అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి ఒక్కరే అన్న నగ్న సత్యాన్ని విస్మరించి వితండవాదాన్ని తెరపైకి తెచ్చారు చంద్రబాబు. నిర్దిష్ట అభివృద్ధి సాధించే అవకాశం ఉన్నా టీడీపీ ప్రభుత్వ హయాంలో రాయలసీమ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని పలువురు వాపోతున్నారు.

గతమంతా రాయలసీమ పట్ల నిర్లక్ష్యమే..

1995–2004 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, 2014–19 విభజన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు రాయలసీమ పట్ల పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శించారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులంటే మండిపడేవారు. తాజాగా 25 టీఎంసీలు నీటి నిల్వకు కారణమైన గండికోట ప్రాజెక్టును ఉమ్మడి ఏపీలో అప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాలోకి చేర్చిన చరిత్రను చంద్రబాబు మూట గట్టుకున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖరరెడ్డి రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులకు నీరు చేరాలంటే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ ఒక్కటే మార్గమని తలచారు. అలా చేస్తేనే కాస్తో, కూస్తో రాయలసీమ ప్రాంతానికి నీరు చేరుతుందని మనస్ఫూర్తిగా నమ్మారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని వైఎస్సార్ సర్కార్ పెంచుతుంటే, టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరరావు ద్వారా అడ్డుకునే ప్రయత్నం చేసింది చంద్రబాబు కాదా అని ఈ ప్రాంత వాసులు నిలదీస్తున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాతైనా రాయలసీమ అభివృద్ధికి కృషి చేస్తారంటే ఐదేళ్ల కాలం ఊకదంపుడు ఉపన్యాసాలతో సరిపెట్టారని పలువురు గుర్తు చేస్తున్నారు. స్టీల్ ప్లాంట్ కడపలో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం పాస్ చేసిన బిల్లు మేరకు ఏర్పాటు చేయలేకపోయారు. పైగా సీఎం హోదాలో ఈ ప్రాంతంలో పర్యటించిన ప్రతిసారి చంద్రబాబు హార్టికల్చర్ హబ్, టూరిజం సర్క్యూట్, మైనింగ్ డెవలప్‌మెంట్ ఇలా చెప్పిందే చెప్పి రాయలసీమ ప్రజలను ఊరించారు. తాజాగా ఆ జాబితాలోకి నారా లోకేష్ వచ్చి చేరిపోయారని పలువురు విమర్శిస్తున్నారు.

పిన్నమ్మకు బంగారు గాజులు...

టీడీపీ అధినేత చంద్రబాబు గురించి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అన్న మాటలను జనం గుర్తు చేసుకుంటున్నారు. 'అమ్మకు అన్నం పెట్టని వాడు, పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తానని అన్నారట' అని బాబు వైఖరిని ఒక్క మాటలో అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి ఆవిష్కరించారు. ఇప్పుడు నారా లోకేశ్ రాయలసీమ మిషన్ పేరుతో ఇస్తున్న హామీలు పెద్దబాబు గురించి వైఎస్సార్ చెప్పిన చందంగా ఉన్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. రాయలసీమలో పుట్టి పెరిగిన చంద్రబాబునాయుడు 14 ఏళ్లపాటు సీఎంగా పని చేసి, సొంత ప్రాంతానికి ఏమీ చేయకపోవడం వల్లే సీమకు ఈ దుస్థితి అని లోకేశ్‌కు తెలియదా? అని మేధావులు మండిపడుతున్నారు. కేవలం రాజకీయ బతుకుల్ని మార్చుకునేందుకే మిషన్ రాయలసీమ అంటూ మాయమాటలు చెబుతున్నారని, ఇప్పటికీ రాయలసీమ పట్ల వివక్ష లేకపోలేదని పలువురు వెల్లడిస్తున్నారు. కొత్త నగరాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలు కోరగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సర్కార్ కొప్పర్తిని ఎంపిక చేసింది. అమరావతిని ఎంపిక చేయకుండా కొప్పర్తి ప్రతిపాదనలు పంపారని సన్నాయి నొక్కులు ఎల్లోబ్యాచ్ అందుకుంది. కనీసం కర్నూలులో హైకోర్టు ఇస్తామని లోకేశ్ హామీ ఇవ్వకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? అంటూ ప్రజలు నిలదీస్తున్నారు. పెద్దబాబు, చినబాబు మాయమాటలు నమ్మే అమాయక స్థితిలో సీమ ప్రజలు లేరనే అభిప్రాయం వివిధ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.

అధికారం కోసమే మిషన్ రాయలసీమ



అధికారంలో ఉంటే చంద్రబాబు నాయుడు కళ్లు లేని కబోదిలా ఉంటారు. అధికారం లేకపోతే అసంబద్ధ ప్రేలాపనలు చేయడం టీడీపీ నేతలకు సర్వసాధారణం. విజన్ 2020 అలాంటిదే. 2000 సంవత్సరంలో విజన్ 2020 ప్రకటించారు. ఆమేరకు పాలన చేసి ఉంటే 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి ఉండేది కాదు కదా? పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విస్తరణ చేయాలనే ఆలోచన టీడీపీ సర్కార్‌కు ఎందుకు రాలేదు? వైఎస్సార్ సర్కార్ పోతిరెడ్డిపాడు విస్తరణ చేసింది కాబట్టే, ఈరోజు రాయలసీమకు నీరు వస్తోంది. పెద్దబాబు బాటలోనే చినబాబు కూడా పయనిస్తున్నారు.
–టి శివప్రసాద్, ఎకనామిక్స్ ప్రొఫెసర్

ఏ మిషన్ చినబాబు? ఓట్ల మిషనా... సీట్ల మిషనా?



కృష్ణా డెల్టా రైతులకు మూడు కార్ల పంటల కోసం జీఓ నంబర్ 69 ద్వారా శ్రీశైలం ప్రాజెక్టులో కనీస నీటిమట్టం ఎత్తు 835 అడుగులకు తగ్గిస్తూ సీఎం హోదాలో చంద్రబాబు నాడు నిర్ణయం తీసుకుని రాయలసీమ ప్రజల గొంతు పిసికారు. పాత కాలువలకు గండ్లు కొట్టి మోటార్లు బిగించి జాతికి అంకితం చేయడం తప్పా, మొన్నటి తొమ్మిదేళ్ల పాలన, నిన్నటి ఐదేళ్ల పాలనలో రెయిన్ గన్లతో కరువు పారదోలడం కాకుండా చంద్రబాబు పూర్తి చేసిన ప్రాజెక్టు ఏమైనా ఉందా? ఉదయం లేచింది మొదలు నిత్యం అమరావతి మంత్రం జపిస్తూ, మనసా వాచా కర్మనా వికేంద్రీకరణను వ్యతిరేకించే మీరు రాయలసీమ అభివృద్ధికి కృషి చేస్తామంటే నమ్మాలా? రాష్ట్రంలో ఏమూలన చీమ చిటుక్కుమన్నా రాయలసీమ రౌడీలు, గూండాలంటూ ఆత్మాభిమానం దెబ్బతీస్తున్నారు. వర్తమానంలో మీరు చేస్తున్నదంతా, భవిష్యత్తులో మీరు చేయబోతున్నదంతా అద్భుతమే అనడం మీ అవకాశవాదం.
–వివేక్ లంకమల, సామాజికవేత్త

నీటిపారుదల శాఖలో భారీగా బదిలీలు

కడప సిటీ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని నీటిపారుదలశాఖలో భారీగా బదిలీలు జరిగాయి. ఈ మేరకు వాటర్ రీసోర్స్ డిపార్టుమెంటు ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యామలరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడుగురు ఉన్నతాధికారులు, 11 మంది డీఈలు, 20 మంది ఏఈలకు స్థాన చలనం కలిగింది.

టీజీపీ ఎస్ఈగా వెంకట్రామయ్య

తెలుగుగంగ ప్రాజెక్టు (ఎఫ్ఏసీ) ఎస్ఈగా వెంకట్రామయ్య నియమితులయ్యారు. ఈయన మైలవరం ప్రాజెక్టు ఈఈగా కొనసాగుతూ కడప ఇరిగేషన్‌శాఖకు ఈఈ (ఎఫ్ఏసీ)గా కొనసాగుతున్నారు. ప్రస్తుతం కడప ఇరిగేషన్ ఈఈగా బదిలీ చేస్తూ అదనపు బాధ్యతలుగా టీజీపీ ఎస్ఈగా నియమించారు. మైలవరం ప్రాజెక్టు ఈఈగా మార్కాపురం నుంచి తిరుపాలయ్యను బదిలీ చేశారు. ఇక్కడ టీజీపీ ఎస్ఈగా ఉన్న శారద కడప క్వాలిటీ కంట్రోల్ డిజైన్స్ ఎస్ఈగా బదిలీ అయ్యారు. టీజీపీ డివిజన్ ఈఈగా ఉన్న రామునాయక్ జీఎన్ఎస్ఎస్ డివిజన్–5 (జమ్మలమడుగు) ఈఈగా బదిలీ అయ్యారు. వెలిగల్లు ప్రాజెక్టు ఈఈగా ఉన్న మధుసూదన్‌రెడ్డిని జీఎన్ఎస్ఎస్ డిప్యూటీ ఎస్ఈగా బదిలీ చేశారు. జీఎన్ఎస్ఎస్–6 ఈఈగా ఉన్న ఇలియాస్ బాషాను సీసీ–3 ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బదిలీ చేశారు. ధవళేశ్వరంలో పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని వెలిగల్లు ఈఈగా బదిలీ చేశారు. జీఎన్ఎస్ఎస్ సర్కిల్ డిప్యూటీ ఎస్ఈగా ఉన్న ఐజాక్ శ్యామూల్ డిప్యూటీ సీఈ (ప్రాజెక్టులు) కడపకు బదిలీ అయ్యారు. క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈగా ఉన్న వెంకట రమణకు తిరుపతి సీఈ (ప్రాజెక్టులు)గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అంతేకాకుండా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఆయా ప్రాంతాల నుంచి 11 మంది డీఈలతోపాటు మరో 20 మంది ఏఈలకు స్థాన చలనం కలిగింది. రెండు, మూడు రోజుల్లో వీరంతా విధుల్లో చేరనున్నారు.

వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ నిర్మాణ పనుల్లో కదలిక

పనులను ప్రారంభించిన వీసీ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్



టెంకాయకొట్టి పనులను ప్రారంభిస్తున్న వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం నూతన భవన నిర్మాణాలకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయం కోసం యోగివేమన విశ్వవిద్యాలయం ఆనుకుని 110.36 ఎకరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. అయితే ఇటీవల విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డిలు రెవెన్యూ అధికారులను కలిసి కేటాయించిన భూములకు హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో పెండ్లిమర్రి రెవెన్యూ అధికారులు విశ్వవిద్యాలయానికి కేటాయించిన భూమికి సంబంధించిన హద్దులను చూపడంతో విశ్వవిద్యాలయం సిబ్బంది హద్దుల వెంబడి జెండాలను పాతారు.

పనులను ప్రారంభించిన వీసీ ఆచార్య బానోతు..

జూలై 8వ తేదీన విశ్వవిద్యాలయ భవన నిర్మాణాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించాలన్న లక్ష్యంతో వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ అధికారులు భూమి చదును పనులను ప్రారంభించారు. గురువారం విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ భూముల్లో పూజ నిర్వహించి, టెంకాయకొట్టి జేసీబీ సహాయంతో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అనుకున్న విధంగా పనులన్నీ సాగితే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించాలన్న లక్ష్యంతో ఉన్నామన్నారు. ఇందుకోసం రెవెన్యూ, అటవీ అధికారుల నుంచి క్లియరెన్స్ వచ్చిందన్నారు. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ సూపరింటెండెంట్ యెద్దుల పవన్ కుమార్‌రెడ్డి, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

పర్‌ఫెక్ట్‌గా ఉంటేనే ఫిట్‌నెస్!

- రవాణాశాఖ అధికారుల విస్తృత తనిఖీలు
- నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలి
- ఈనెల 12 నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం
- జిల్లాలో 948కు పైగా విద్యా సంస్థల బస్సులు
- ఎఫ్‌సీలు పొందిన తర్వాత రోడ్డెక్కాలని అధికారుల సూచన



విద్యా సంస్థ రికార్డులను పరిశీలిస్తున్న రవాణాశాఖ అధికారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: స్కూలు బస్సుల ఫిట్‌నెస్‌పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా రోడ్డు రవాణాశాఖ అధికారులకు ఆ దిశగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో నిబంధనలు పాటించని స్కూలు బస్సులపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. జిల్లాలోని అన్ని స్కూలు బస్సులు పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండాలని, ఇందులో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తూ ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. గతేడాది స్కూలు బస్సులకు ఇచ్చిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గడువు మే నెలలో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 948కి పైగా స్కూలు బస్సులు ఉన్నాయి. వీటిలో వందలాది మంది విద్యార్థులు విద్యా సంస్థలకు రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా స్కూలు బస్సులు పూర్తి కండీషన్‌లో ఉండాలని, అందుకు అనుగుణంగా అన్ని విద్యా సంస్థల యాజమాన్యాలు నిబంధనలకు అనుగుణంగా గడువు తేదీలోగా ఎఫ్‌సీలు పొందాలని రవాణాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఈలోగా ప్రతి స్కూలు బస్సుకు తప్పనిసరిగా ఎఫ్‌సీ పొందాలని సూచిస్తున్నారు.

ఇవీ స్కూలు బస్సుల నిబంధనలు

- రోడ్డుపై తిరిగే ప్రతి స్కూలు బస్సుకు ఎఫ్‌సీ తప్పనిసరి.
- వేగ నియంత్రణకు ప్రతి బస్సులోనూ కచ్చితంగా స్పీడ్ గవర్నర్లు ఉండాలి.
- స్కూలు బస్సుల వేగం 60 కి.మీ.కు మించరాదు.
- బస్సు డ్రైవర్‌కు ప్రతి ఆరు నెలలకు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించాలి. వారికి కంటి సంబంధిత సమస్యలు లేవని ధ్రువపత్రం ఉండాలి.
- బస్సుకు సంబంధించిన అన్ని లైట్లు పనిచేయాలి.
- వెనుకనుంచి వచ్చే వాహనానికి చీకటిలో కూడా కనిపించే విధంగా బస్సు వెనుకవైపు తప్పనిసరిగా రేడియేషన్ స్టిక్కర్ అతికించాలి.
- బస్సుకు అత్యవసర ద్వారం ఉండాలి. అక్కడ అత్యవసర ద్వారమని స్పష్టంగా కనిపించేలా రాయించాలి.
- మంటలను ఆర్పే పరికరాన్ని అమర్చాలి.
- ప్రతి బస్సులోను ఫస్ట్ ఎయిడ్ బాక్సు ఉండేలా చూడాలి.
- స్కూలు బస్సుకు తప్పనిసరిగా అటెండర్ ఉండాలి.
- ఫిర్యాదుల పుస్తకంలో డ్రైవర్, బస్సు పనితీరు గురించి విద్యార్థులతో రాయించాలి.
- విద్యార్థి తండ్రి తప్పనిసరిగా ఒకరోజు బస్సులో ప్రయాణించేలా చూడాలి.
- ఏ స్కూలు బస్సులో అయితే విద్యార్థులు ప్రయాణిస్తారో వారి పేర్లను కచ్చితంగా రిజిస్టర్‌లో నమోదు చేసి బస్సులో ఉంచాలి.

త్వరగా పూర్తి చేస్తాం



స్కూలు బస్సులకు గతేడాది ఇచ్చిన ఎఫ్‌సీ గడువు ముగిసింది. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బస్సుకు ఎఫ్‌సీ తీసుకోవాలి. నిబంధనలు పాటించకుండా రోడ్లపై తిరిగే స్కూలు బస్సులపై చర్యలు చేపడతాం. అన్ని స్కూలు బస్సులకు త్వరలోనే ఎఫ్‌సీ జారీని పూర్తి చేస్తాం.
– నిరంజన్‌రెడ్డి, జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్, కడప

12న జగనన్న విద్యాకానుక పంపిణీ


- 17న ఆణిముత్యాలు
- 28న అమ్మ ఒడి
- సంతృప్త స్థాయిలో ఫిర్యాదుల పరిష్కారం
- కలెక్టర్ విజయరామరాజు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : ఈనెల 12వ తేదీ పాఠశాలలు ప్రారంభమయ్యేరోజే జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయరామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి వివిధ అంశాలపై కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. కిట్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలని చెప్పారు. ప్రజల నుంచి అందే స్పందన అర్జీలకు వేగవంతమైన పరిష్కారం చూపాలన్నారు. జిల్లా స్థాయిలో ఈనెల 17వ తేదీ జరగనున్న జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా పదవ తరగతి, ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. ఈ నెల 28న చేపట్టే అమ్మ ఒడి పథకం లబ్ధిదారుల జాబితా ఈనెల 15 నాటికి పూర్తి చేసి అభ్యంతరాలను స్వీకరించి పరిశీలించాలని చెప్పారు. వైద్య విధాన పరిషత్‌ను రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో పీహెచ్‌సీ స్థాయిలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు మరింత గట్టిగా గ్రామాల్లో సేవలు అందించాలని చెప్పారు. స్పందనతోపాటు 1902 టోల్ ఫ్రీ నంబరు గురించి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఈ సమావేశంలో జేసీ గణేష్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో గంగాధర్‌గౌడ్, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, సీపీఓ వెంకట్రావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సన్నద్ధతకు ఇండక్షన్ ట్రైనింగ్ ఉపయోగకరం



మాట్లాడుతున్న రూటా రాష్ట్ర సమన్వయకర్త

రాయచోటి అర్బన్ : విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించేందుకు ఉర్దూ ఉపాధ్యాయులకు ఇండక్షన్ ట్రైనింగ్ ఎంతో ఉపయోగకరమని రూటా రాష్ట్ర సమన్వయకర్త మహమ్మద్ అయూబ్ అన్నారు. గురువారం స్థానిక డైట్ కళాశాలలో నిర్వహించిన 1998, 2008 ఎంటీఎస్ ఉర్దూ, డీఎస్సీ 2018 ఉర్దూ ఎస్‌జీటీ ఉపాధ్యాయుల శిక్షణా శిబిరాన్ని ఆయన సందర్శించారు. కోర్స్ డైరెక్టర్ అసదుల్లాబాషా, కో–ఆర్డినేటర్ జాఫర్ హుస్సేన్, రిసోర్స్‌పర్సన్‌లు సత్తార్‌ఫైజీ, సిబాతుర్ రహిమాన్, జాఫరుద్దీన్, ఇమ్రోజ్‌ఖాన్, మహబూబ్‌బాషా, సజ్జాద్, సయ్యద్ బాషా, షఫీవుల్లా, సికిందర్, హుమయుద్దీన్ పాల్గొన్నారు.

లోకేష్‌పై కోడి గుడ్డు వేసింది టీడీపీ అభిమానే

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



పుట్టా సుధాకర్ యాదవ్‌తో బాబు ఉన్న ఫొటోను చూపిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో జరిగిన యువగళం పాదయాత్ర సందర్భంగా టీడీపీ నాయకుడు నారా లోకేష్‌పై కోడిగుడ్డు వేసింది టీడీపీ అభిమానేనని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆయన గురువారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రొద్దుటూరు మండలంలోని సోములవారిపల్లె గ్రామ పంచాయతీ పెన్నానగర్‌కు చెందిన బాబు, శంకరాపురం గ్రామానికి చెందిన వినయ్ ఒకరికొకరు బంధువులు అని, వీరు టీడీపీ అభిమానులని ఎమ్మెల్యే తెలిపారు. మైదుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడు పుట్టా మహేష్ వాహనానికి డ్రైవర్‌గా వినయ్ పనిచేస్తున్నాడన్నారు. టీడీపీ అభిమానులైన వీరు ప్రొద్దుటూరుకు పాదయాత్ర వచ్చిన సందర్భంగా లోకేష్‌తో కరచాలనం చేయాలని, సెల్ఫీ తీసుకోవాలని ప్రయత్నించారన్నారు. బొల్లవరం నుంచి శివాలయం సెంటర్ వరకు ప్రయత్నించినా వీరికి ఎవరూ సహకారం అందించలేదన్నారు. దీంతో ఆగ్రహానికి గురైన బాబు రిలయన్స్ పెట్రోలు బంకు వద్దకు రాగానే పాదయాత్రలో వెళుతున్న లోకేష్‌పై కోడిగుడ్డు విసిరాడన్నారు. వెంటనే పోలీసులు ఇరువురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారన్నారు. వాస్తవానికి టీడీపీ అభిమాని గుడ్డు విసిరినా దీనిని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి అంటగట్టారన్నారు. గుడ్డు విసిరిన వెంటనే బాబును లోకేష్ భద్రతా సిబ్బందితోపాటు స్థానిక టీడీపీ నాయకులు చితకబాదారని అన్నారు. ఈ వాస్తవాలను చెప్పకుండా లోకేష్ ప్రతి నియోజకవర్గంలో కోడిగుడ్డు, ఆమ్లెట్ కథ చెబుతున్నారన్నారు. వాస్తవానికి గుడ్డు వేసింది వారే, ఆమ్లెట్ అయింది వారి అభిమానులేనన్నారు. ఏఎస్పీ ప్రేరణాకుమార్ వీరిని అదుపులోకి తీసుకుని వాస్తవాలను వెల్లడించారన్నారు. గతంలో ఏఎస్పీ పనితీరుకు టీడీపీ నేతలే కితాబు ఇచ్చారని పేర్కొన్నారు. గుడ్డు విసిరిన సంఘటనకు వైఎస్సార్‌సీపీకి ఏమాత్రం సంబంధం లేదని అందరూ గ్రహించాలని కోరారు. పుట్టా సుధాకర్ యాదవ్, ఆయన కుమారుడు పుట్టా మహేష్‌లతో బాబు, వినయ్‌లు దిగిన ఫొటోలను ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ ఫొటోలు కూడా పాదయాత్రలో లోకేష్ బస చేసిన చోట దిగినవేనని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కాస్మొటిక్ దుకాణాలపై దాడులు

కడప అర్బన్ : కడపలోని వైవీస్ట్రీట్‌లో ఉన్న నాలుగు కాస్మొటిక్ దుకాణాలపై సీఐ ఎన్.వి నాగరాజు ఆదేశాల మేరకు ఎస్ఐ రంగస్వామి తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. కిమరాజ్, మహీబ్‌భాయ్, నార్పట్ లాల్, అశోక్ నకిలీ కాస్మొటిక్ ఉత్పత్తులను తీసుకొచ్చి లాక్‌మీ కంపెనీ ప్రొడక్ట్స్ మాదిరిగా విక్రయిస్తున్నారని సంస్థ ప్రతినిధి ఫణికుమార్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఇంకా ఎవరైనా ఇలాంటి నకిలీ ఉత్పత్తులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలను తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాదాపు రూ. లక్ష మేరకు నకిలీ ఉత్పత్తులను సీజ్ చేసినట్లు తెలియజేశారు.

దాడులు, దౌర్జన్యాలకు కేరాఫ్ పుత్తా ఫ్యామిలీ



మాట్లాడుతున్న ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్

కడప కార్పొరేషన్ : దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులకు పుత్తా నరసింహారెడ్డి ఫ్యామిలీ ఫేమస్ అని ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్ అన్నారు. గురువారం కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిలపై పుత్తా చైతన్య రెడ్డి విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. రాజకీయాలపై చైతన్యరెడ్డికి అవగాహన లేదన్నారు. ప్రజలను కొట్టి, భయపెట్టి రిగ్గింగ్‌లకు పాల్పడే సంస్కృతి వైఎస్సార్‌సీపీది కాదన్నారు. పుత్తా కుటుంబానికి భయపడి కమలాపురం నియోజకవర్గంలో చాలా గ్రామాల ప్రజలు ఓటు వేసేందుకు ముందుకు రాలేని పరిస్థితి ఇప్పటికీ ఉందన్నారు. ఎక్కడ కొత్తగా వెంచర్లు వేసినా పుత్తా ఫ్యామిలీ అక్కడ వాలిపోయి కమీషన్లు దండుకుంటుందన్నారు. దళితుల భూములు, డీకేటీ భూములన్నీ వారి స్వాధీనంలోనే ఉన్నాయన్నారు. పుత్తా నరసింహారెడ్డి ప్రజలకు మంచి చేసి ఉంటే ప్రజలు ఆయన్ను ఎందుకు గెలిపించరని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రూ.600కోట్లు మంజూరు చేసిందని పుత్తా చెబుతున్నారని, ఆ నిధులతో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. నీరు-చెట్టు పనులు చేసి కార్యకర్తలకు ఇవ్వకుండా వారు మాత్రమే తిన్నారని ఆరోపించారు. టీడీపీ పాలనలో తక్కువ ఎత్తులో నిర్మించడం వల్లే హజ్‌హౌస్ వర్షాలకు మునిగిపోతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా పుత్తా ఓటమి తథ్యమన్నారు. లోకేష్ పాదయాత్రకు డబ్బు, మద్యం ఇచ్చి జనాన్ని తోలారని, అది వాపేనని...బలుపు అని వారనుకుంటే భ్రమేనన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కె. రాజశేఖర్‌రెడ్డి, సుబ్బరాయుడు, జి. శ్రీనివాసులరెడ్డి, చంద్రహాసరెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.


లంకమలలో పెరుగుతున్న చిరుతలు



గత నెలలో అమర్చిన కెమెరాలో లభ్యమైన చిరుతపులి

అట్లూరు : లంకమల్లేశ్వర అభయారణ్యంలో చిరుతపులులు ఏటికేడాది పెరుగుతున్నాయి. గత నెలలో పులుల గణనలో భాగంగా కెమెరాలు అమర్చారు. వాటిని పరిశీలించగా సుమారు 60 చిరుత పులులు ఉన్నట్లు తేలిందని అటవీ అధికారులు తెలిపారు.గతంలో 30 నుంచి 40 ఉండేవని చెప్పారు. సిద్దవటం, అట్లూరు, బద్వేలు మండలాల పరిధిలో లంకమల్లేశ్వర అభయారణ్యం సుమారు 27 వేల హెక్టార్లలో విస్తరించి ఉంది. నల్లమలతో పాటు ఇది కూడా దట్టమైన అడవి. అపారమైన అటవీ సంపద ఉంది. జంతు జాతులైన జీవరాసులకు కూడా నిలయం అని చెప్పవచ్చు. లంకమల్లేశ్వర అభయారణ్యం పరిధిలో గత నెలలో అధునాతనమైన కెమెరాలను అమర్చారు. వాటిని పరిశీలించగా అందులో చిరుతపులులతో పాటు రకరకాల జంతువుల చిత్రాలు దర్శనమిచ్చాయి. లంకమల్లేశ్వర అభయారణ్యంలో పులుల గణనలో భాగంగా 2019 మేనెలలో అమర్చిన కెమెరాల్లో పెద్దపులి (టైగర్)దర్శనమిచ్చింది.ఆపై కనిపించలేదు.పెద్దపులి ఉనికిని కనుగొంటామని సిద్దవటం రేంజ్ అధికారి ప్రసాద్‌తెలిపారు. లంకమల్లేశ్వర అభయారణ్యంలో చిరుతపులుల సంఖ్య పెరుగుతోందని, ప్రస్తుతం 60 ఉన్నట్లు గుర్తించామని ప్రసాద్ తెలిపారు.

పసుపు కొనుగోలులో నాణ్యత ప్రమాణాలను సడలించాలి



కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న తిరుపాల్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : పసుపు కొనుగోలు విషయంలో నాణ్యత ప్రమాణాలను కొంతమేర సడలించాలని ఏపీ రాష్ట్ర వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి కలెక్టర్ విజయరామరాజును కోరారు. గురువారం కలెక్టర్‌ను కలిసి రైతుల తరుపున వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది కాలంగా పసుపుకు మద్దతు ధర లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వరి, పసుపు రైతులకు మద్దతు ధరను ప్రకటించి, రైతు భరోసా కేంద్రాల పరిధిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పసుపును కొనుగోలు చేస్తోందన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా గత సంవత్సరం పసుపు కొనుగోలు కేంద్రం పెట్టినప్పటికీ ప్రభుత్వం పెట్టిన నాణ్యత నిబంధనలకు అనుగుణంగా పసుపు లేనందున రైతులు అమ్మలేక ఏపీ గోడౌన్లలో నిల్వ చేసుకున్నారన్నారు. ఈ ఏడాది కూడా ఆ సమస్య రైతులను వేధిస్తోందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం కొంత సడలింపు ఇస్తే రైతులు నష్టపోకుండా ఉంటారన్నారు.. ఈ విషయాన్ని రైతుల తరుపున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తిరుపాల్‌రెడ్డి కలెక్టర్‌ను కోరారు.

ఆటోబోల్తా

– 8మందికి గాయాలు

మదనపల్లె : ప్యాసెంజర్ ఆటో బోల్తా పడి ఎనిమిది మందికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం అన్నమయ్య కురబలకోట మండలం చేనేతనగర్ వద్ద జరిగింది. అంగళ్లు నుంచి మదనపల్లెకు ప్రయాణికులతో వస్తున్న ఆటోలో టమాటా మండీలో పని చేసే కూలీలు ఉన్నారు. ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి ఆటోడ్రైవర్ ఆటోను పక్కకు తిప్పాడు. వేగాన్ని అదుపుచేయలేక పోవడంతో రోడ్డుపక్కన బోల్తా పడింది. ప్రమాదంలో మదనపల్లెకు చెందిన రెడ్డిరాణి(30), అరుణ(35), రెడ్డెమ్మ(55), ఫాతిమా(70), చిన్నరెడ్డెమ్మ(29), వాహిదా(55), ఫైజల్(5), ఆటోడ్రైవర్ మహేశ్వర్(36) గాయపడ్డారు.

ఆత్మహత్యకు యత్నం : కాపాడిన పోలీసులు



గురుమోహన్‌ను తన తల్లికి అప్పగిస్తున్న ఎస్ఐ నాగమురళి

కలసపాడు : మండలంలోని మామిళ్లపల్లెకు చెందిన బొజ్జ చంటెమ్మ కుమారుడు బొజ్జ గురుమోహన్ అనే వ్యక్తి భార్యతో గొడవపడి ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడు.తల్లి ఫిర్యాదుతో అతని పోలీసులు కాపాడారు. వివరాలు..గురుమోహన్ పోరుమామిళ్లలో నివాసం ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి పది సంవత్సరాల క్రితం శేషమ్మతో వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బుధవారం మధ్యాహ్నం భార్యతో గొడవపడిన అతను తన కుమార్తెలలో ఇద్దరిని తీసుకుని గిద్దలూరుకు వెళ్లి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంటానని తన తల్లి చంటెమ్మకు ఫోన్ ద్వారా తెలిపారు. చంటెమ్మ పోలీసులకు రాత్రి ఫిర్యాదు చేసింది. స్థానిక ఎస్ఐ నాగమురళి వెంటనే కడప సైబర్ క్రైమ్ ఎస్ఐ మధుమల్లేశ్వర్‌రెడ్డి, గిద్దలూరు పోలీసులకు సమాచారం అందించి గురుమోహన్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా ట్రేస్‌అవుట్ చేసి గిద్దలూరు రైల్వేస్టేషన్ ప్రాంగణంలో గుర్తించి స్థానిక పోలీసులకు గిద్దలూరు పోలీసులు అప్పగించారు. గురువారం ఎస్ఐ నాగమురళి గురుమోహన్‌కు కౌన్సెలింగ్ ఇచ్చి తన తల్లికి అప్పగించారు. గురుమోహన్, ఇద్దరు పిల్లల ప్రాణాలను కాపాడిన ఎస్ఐని అభినందించారు.

చట్టసభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి



మాట్లాడుతున్న ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్‌రావు

కడప కార్పొరేషన్ : చట్టసభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం కడప పాతరిమ్స్‌లోని బీసీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రావడానికి బీసీల మద్దతు కోరే రాజకీయ పార్టీలు ఏరుదాటాక తెప్ప తగలేసిన చందంగా తయారయ్యాయన్నారు. దేశ వ్యాప్తంగా బీసీ గణన చేపట్టాలన్నారు. బీసీ కుల గణనపై జాతీయ స్థాయిలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. బీసీలకు ప్రత్యేక స్థానం కల్పించే దిశగా కేంద్ర మంత్రిత్వ శాఖలో స్థానం కల్పించాలన్నారు. బీసీ డిమాండ్లపై త్వరలో దేశ వ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నామన్నారు. ఈ సమస్యలన్నింటిపై ఆగస్టు 7వ తేది తిరుపతిలో జరిగే జాతీయ ఓబీసీ మహాసభలో చర్చించనున్నామన్నారు. ఆ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు క్రాంతి కుమార్, జిల్లా అధ్యక్షుడు బి. లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, బంగారు నాగయ్య యాదవ్, నారాయణమ్మ, పస్తం అంజి పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ హర్షణీయం



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

కడప ఎడ్యుకేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ పట్ల కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం హర్షణీయమని గవర్నమెంట్ కాంట్రాక్టు లెక్చరర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఇందుకు సహకరించిన పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ. రామచంద్రారెడ్డిని గురువారం తన కార్యాలయంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలో 3594 మంది జూనియర్ అధ్యాపకులకు గాను 1500 మందికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గవర్నమెంట్ కాంట్రాక్ట లెక్చరర్ల ఫెడరేషన్ నాయకులు సుబ్బయ్య, నవీన్, వేణు, మధు, ప్రక్రుద్దీన్, గీత, స్వప్న, హఫీజుల్లా, దిల్షాద్, షహనభీ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో విశ్వంకు రాష్ట్ర స్థాయి ర్యాంకులు



విద్యార్థులను అభినందిస్తున్న విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల(ఏపీఆర్‌జేసి)ల్లో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులతో పాటు టాప్ 10లో 9ర్యాంకులను కైవసం చేసుకున్నారు. ఆ మేరకు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాల్లో ఆర్.తనూజ, ఎం.భువనేశ్వర్‌రెడ్డి రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకులు, టి.వర్షా, కె.లక్ష్మణవర్మ ద్వితీయ, బి.భువనేశ్వరి, బి.సిద్ధార్థలు తృతీయ ర్యాంకులు, అలాగే పి.సౌమ్య 5వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసి, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రయాణికులకు మెరుగైన వసతులు



బద్వేలు డిపోను తనిఖీ చేస్తున్న ఆర్టీసీ కడప జోన్ ఈడీ వెంకటేశ్వరరావు

బద్వేలు అర్బన్ : కడప జోన్ పరిధిలోని అన్ని డిపోల్లో ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పిస్తామని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఈడీ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక బద్వేలు డిపోను ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన డిపోలో ప్రయాణికులకు అందుతున్న వసతులను, కార్గో పార్శిల్ యూనిట్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ బద్వేలు డిపోలోని ప్లాట్‌ఫాం పైకప్పునకు తక్షణమే మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. గ్యారేజీలోని కార్మికులతో మాట్లాడి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చి ఆర్టీసీపై మరింత నమ్మకం పెరిగేలా చూడాలని కోరారు. బస్సులను పరిశుభ్రంగా ఉంచుకుని ఆర్టీసీ ఆదాయం పెంచుకునేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి



నోటీసులు జారీ చేస్తున్న వైద్యాధికారులు

జమ్మలమడుగు : ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, వైద్యపరీక్షలు నిర్వహించడం, సైలైన్ బాటిళ్లు ఎక్కించడం చేయరాదని డీఎంహెచ్ఓ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పలు ఆర్ఎంపీ వైద్యశాలలను జిల్లా వైద్యాధికారులు తనిఖీ చేశారు. డీఎంహెచ్ఓ ఉమామహేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ శాంతికళ, డీఈఎంఓ ప్రమీలలు ఆర్టీసీ బస్టాండ్, అలంకార్ హాల్ తదితర ప్రాంతాల్లో ఆర్ఎంపీ వైద్యులు నిర్వహిస్తున్న క్లినిక్‌లను తనిఖీ చేశారు. చాలా మంది సర్టిఫికెట్‌లు లేకున్నా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు ధ్రువీకరించారు. అనంతరం వారికి నోటీసులను జారీ చేశారు.ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు పట్టణంలో పలు ప్రాంతాల్లో దాడులు చేశామని, చాలా మంది ధ్రువీకరణ పత్రాలు లేకుండానే వైద్యం చేస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రజలు కూడా ఆర్ఎంపీల వద్దకు కాకుండా ప్రభుత్వాసుపత్రికి వెళ్లాలని,నిపుణులైన వైద్యుల వద్దే వైద్యం చేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు,పాలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంపులోపడి వ్యక్తి మృతి



బ్రహ్మానందరెడ్డి (ఫైల్)

లింగాల : లింగాల మండలం రామనూతలపల్లె గ్రామానికి చెందిన ఆర్ బ్రహ్మానందరెడ్డి(55) అనే వ్యక్తి గురువారం మధ్యాహ్నం ఆయన పొలంలో ఉన్న వ్యవసాయ సంపులో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. వివరాలు.. బ్రహ్మానందరెడ్డి పులివెందులలో నివాసముంటున్నాడు. పొలంవద్ద వ్యవసాయ మోటార్లను ఆడించేందుకు సంపువద్దకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు కాలు జారి సంపులో పడిపోయాడు. ఆయనకు ఈత రాకపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్‌చేయగా ఫోన్‌పనిచేయలేదు. దీంతో వారు హుటాహుటిన పొలంలో వెతికారు. ఆయన సంపులో విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే మృతదేహాన్ని వారి నివాసానికి తరలించారు. ఆయనకు భార్య ఇందిరమ్మ, కుమారుడు ఉన్నారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పశు సంవర్ధకశాఖలో బదిలీలు

కడప అగ్రికల్చర్ : జిల్లా పశుసంవర్ధకశాఖలో పలువురు అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. వీరిలో అసిస్టెంట్ డైరెక్టర్లతోపాటు పలువురు పశువైద్యాధికారులు ఉన్నారు.

బదిలీ వివరాలు ఇలా

పనిచేస్తున్న స్థానం	ఏడీ	బదిలీ అయిన స్థానం
ముద్దనూరు	నేతాజీ	ప్రొద్దుటూరు
కమలాపురం	ధనుంజయరెడ్డి	ముద్దనూరు
చిత్తూరు	ఇందిరమ్మ	ముద్దనూరు
ప్రొద్దుటూరు	వెంకటసుబ్బయ్య	బి.మఠం
కడప వీపీసీ	శ్రీధర్‌లింగారెడ్డి	సీకేదిన్నె
ఎల్‌ఆర్‌పల్లి	ఉత్తయ్య	కమలాపురం
సీకేదిన్నె	లక్ష్మీదేవి	సిద్దవటం
కడప వీపీసీ	సుధీర్‌నాథ్‌బెనర్జీ	ఎల్‌ఆర్‌పల్లె
సిద్దవటం	సుబ్బరాయుడు	కడప వీపీసీ

పశువైద్యుల వివరాలు ఇలా

పులివెందుల	సాదిక్‌బాషా	వేంపల్లి
పాతకడప	శ్రీకాంత్‌రెడ్డి	ఆకేపాడు
వేంపల్లి	మల్లికార్జునరెడ్డి	పందిళ్లపల్లె
ఆకేపాడు	వేణుగోపాల్	పాతకడప
కోనంపేట	మాధవరెడ్డి	పెద్దపుత్త
పెద్దపుత్త	చంద్రకళ	తిరుపతి